

'పది' తెలుగు పరీక్షల్లో పద్యాలను కొనసాగించండి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

2024 మార్చిలో జరగబోవు 10వ తరగతి ప్రథమ భాష తెలుగు పరీక్షలో ప్రతిపదార్థ పద్యాలు, కంఠస్థ పద్యాలను కొనసాగించాలని తెలుగు ఉపాధ్యాయులు, తెలుగు భాషా సంరక్షణ సమితి జిల్లా సహాయ కార్యదర్శి గంగనపల్లి వెంకటరమణ ప్రభుత్వ పరీక్షల సంచాలకులకు పంపిన ఒక వినతిపత్రంలో కోరినట్లు తెలిపారు. ప్రాథమిక పాఠశాల దశలో చిన్న తరగతుల నుంచే కంఠస్థ పద్యాలను, ఉన్నత తరగతులలో ప్రతిపదార్థ పద్యాలు, పద్యాలు, భావాలను విద్యార్థులు నేర్చుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. పబ్లిక్ పరీక్షల్లో వాటిని తొలగించడం ద్వారా విద్యార్థులు కంఠస్థ పద్యాలను, వాటి భావాలను నేర్చుకునేందుకు ఆసక్తి చూపరని, తద్వారా మాతృభాష మాధుర్యానికి దూరమవుతారని తెలిపారు. పద్యం తెలుగు భాష సొంతమని, అది ఎంతగానో హృద్యంగా ఉండి మనసుకు హత్తుకుంటుందని, అలాంటి పద్యాలలో దాగుంటుందనడానికి పద్యమే ఉదాహరణ అని ఆయన పేర్కొన్నారు. కనుక ఎప్పటి నుంచో పరీక్షల్లో వస్తున్న ప్రతిపదార్థ పద్యాలు, కంఠస్థ పద్యాలు, భావాలను తొలగించే విషయంలో మరో మారు పునరాలోచించాలని కోరారు.

ఉద్యోగ, ఉపాధ్యాయులను విస్మరిస్తే పతనం తప్పదు

- కలెక్టరేట్ ఎదుట నిరసనలో ఫ్యాప్టో నాయకులు



కలెక్టరేట్ ఎదుట నిరసనలో మాట్లాడుతున్న రవిశంకర్

ప్రజాశక్తి-రాయచోటి

ఉద్యోగ, ఉపాధ్యాయులను విస్మరిస్తే పాలకుల పతనం తప్పదని ఫ్యాప్టో అన్నమయ్య జిల్లా నాయకులు హెచ్చరించారు. శనివారం ప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణ కోసం, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కలెక్టర్ వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో పాలకవర్గాలు పూర్తిగా విఫలమయ్యాయని ఆరోపించారు. గత ఎన్నికల ముందు అనేక హామీలిచ్చి, ఉద్యోగ ఉపాధ్యాయుల అండదండలతో అధికారంలోకి వచ్చిన పాలకవర్గాలు ఉద్యోగ, ఉపాధ్యాయులను విస్మరించడం దారుణమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యా రంగ నిర్వహణ బాధ్యతల నుండి తప్పుకుంటున్నాయని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానాన్ని అమలు చేసే సాకుతో జీఓ 117 అమలు చేసి ప్రాథమిక విద్యకు పాడెకట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కిలోమీటర్ పరిధిలోని ఉన్నత పాఠశాలలో 3, 4, 5 తరగతులను విలీనం చేసి ప్రాథమిక పాఠశాలలను అస్తవ్యస్తంగా మార్చివేశారన్నారు. అధికారంలోకి వచ్చిన వారంలోపే రద్దు చేస్తామన్న కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం నేటికీ కొనసాగుతున్నదన్నారు. సిపిఎస్ స్థానంలో జిపిఎస్‌ను అమలు చేస్తామని ప్రకటించి మరో మారు ఉద్యోగ, ఉపాధ్యాయులను వంచించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వం తమ వైఖరిని మార్చుకోకపోతే తగు మూల్యం చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల పట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. పాఠశాల విద్య ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ పాఠశాలల సందర్శన పేరుతో ఉపాధ్యాయులను వేధిస్తున్నారని విమర్శించారు. చిన్నచిన్న కారణాలను సాకుగా చూపి ఉపాధ్యాయులకు షోకాజు నోటీసులివ్వడం, సస్పెన్షన్లు చేయడం తగదన్నారు. ప్రవీణ్ ప్రకాష్‌ను నియంత్రించడంలో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. ఉద్యోగులకు చెల్లించాల్సిన పిఆర్‌సి, డిఎ బకాయిలను చెల్లించకపోవడం దారుణమన్నారు. జులై ఒకటో తేదీ నుండి 12వ పిఆర్‌సిని అమలు చేయాల్సి ఉండగా, కమిషన్ నియమించి చేతులు దులుపుకున్నారే తప్ప విధివిధానాలు రూపొందించి అమలు చేయడం లేదని విమర్శించారు. గత పిఆర్‌సి కమిషన్ ఇచ్చిన రిపోర్టును అమలు చేయకుండా దాచి ఉంచిన ప్రభుత్వం, ఇప్పుడు నూతనంగా కమిషన్ ఏర్పాటు చేయడం వల్ల ఒరిగేదేమీ ఉండదన్నారు. తక్షణం 12వ పిఆర్‌సిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అప్పటివరకు మధ్యంతర భృతిని ప్రకటించాలన్నారు. ఐదవ తరగతి వరకు పనిచేసే ఉపాధ్యాయులకు రెండు మాసాలుగా వేతనాలు చెల్లించకపోవడం తగదన్నారు. తక్షణం ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు దాచుకున్న ప్రావిడెంట్ ఫండ్, ఎపిజిఎల్ఐ మొత్తాలను ప్రభుత్వం తమ అవసరాలకు వాడుకోవడం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. ప్రావిడెంట్ ఫండ్, ఎపిజిఎల్ఐ రుణాల కొరకు, అంతిమ చెల్లింపుల కొరకు దరఖాస్తు చేసుకొని సంవత్సరాల తరబడి ఎదురు చూడాల్సి రావడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు చర్యలు తీసుకోవడంతోపాటు, ఉపాధ్యాయుల సమస్యలపై సంఘాలతో చర్చించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. నిరసన కార్యక్రమంలో ఫ్యాప్టో చైర్మన్ జగన్‌మోహన్‌రెడ్డి, కార్యదర్శి రవిశంకర్, నాయకులు హరిప్రసాద్, మహమ్మద్ ఇలియాస్, హరిబాబు, భాస్కర్‌రెడ్డి, శివారెడ్డి, రవీంద్రారెడ్డి, వీరాంజనేయులు, ఆర్.వి.రమణ, రఫీక్, సిబాతుర్, ఖిలపాయత్, చెంగల్‌రాజు, చంద్రశేకర్, నాగమునిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతుల సేవలో అగ్రి ల్యాబ్స్

- జిల్లాలో ఆరు ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌లు
- విత్తనాల నాణ్యత నిర్ధారణకు ఉచితంగా పరీక్ష
- ఎరువులు, పురుగు మందుల పరీక్షలకు సదుపాయం



ప్రజాశక్తి-రాయచోటి

విత్తనం మంచిదైతే పంట బాగుంటుంది. పంట కళకళలాడితే దిగుబడి దిగులుండదు. దిగుబడి, ధరలూ బాగుంటే ఇక రైతన్నకు తిరుగుండదు. అంతా సవ్యంగా జరగాల్లంటే మేలి రకం విత్తనం కావాలి. అన్నదాతలు నకిలీ విత్తనాలతో మోసపోకుండా వైఎస్సార్ అగ్రి ల్యాబ్స్ భరోసా కల్పిస్తున్నాయి. ఏటా రూ.వేల కోట్ల పెట్టుబడి మట్టి పాలు కాకుండా కాపాడుతున్నాయి. పైసా ఖర్చు లేకుండా ఇన్‌పుట్స్‌ను ముందుగానే పరీక్షించుకోవడం ద్వారా నాసిరకం బారిన పడకుండా ధైర్యంగా సాగు పనులు చేపడుతున్నామని రైతన్నలు ఆనందంగా చెబుతున్నారు. నాణ్యమైన ధ్రువీకరించిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు ఇప్పటికే వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల ద్వారా గ్రామాల్లోనే రైతులకు అందుబాటులోకి వచ్చాయి. ప్రతి నియోజకవర్గానికి ఒకటి చొప్పున గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటవుతున్న వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్స్ నాణ్యత పరీక్షలతో రైతుకు భరోసా కల్పిస్తున్నాయి.

జిల్లాలోని రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు, మదనపల్లి, తంబళ్లపల్లిలో కేంద్రాలు సేవలందిస్తుండగా కొద్ది నెలల్లోనే పీలేరు నియోజకవర్గంలోని ల్యాబ్ కూడా ప్రారంభానికి నోచుకోనుంది. ఆర్బీకేల ద్వారా సరఫరా చేసే ఇన్‌పుట్స్‌తో పాటు మార్కెట్‌లోకి వచ్చే ప్రతీ ఇన్‌పుట్ శాంపిల్‌ను ఇక్కడ పరీక్షించుకునే సదుపాయం ఉండటం వల్ల రైతుల్లో నమ్మకం పెరుగుతోంది. సొంతంగా తయారు చేసుకున్న విత్తనమైనా, మార్కెట్‌లో కొనుగోలు చేసినవైనా నేరుగా ఈ ల్యాబ్‌కు వెళ్లి నాణ్యతను ఉచితంగా పరీక్షించుకోవచ్చు. విత్తనమే కాకుండా ఎరువులు, పురుగు మందుల నాణ్యతను కూడా పరీక్షించుకుని ధీమాగా సాగు పనులు చేపట్టవచ్చు. ఇప్పటికే రైతు భరోసా కేంద్రాలతో చాలా సేవలు రైతులకు సులువుగా చేరువయ్యాయి. ఇప్పుడు ఈ ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌ల తో వ్యవ'సాయం' మరింత సులువు కానుంది.

ప్రతి ల్యాబ్‌లో ఆటోమేషన్

నమూనాల పరీక్ష కోసం ప్రత్యేకంగా ఆటోమేటెడ్ క్వాలిటీ కంట్రోల్ యాప్ (ఇన్‌సైట్) అభివృద్ధి చేశారు. ఫలితాలను ట్యాంపర్ చేసేందుకు వీల్లేని రీతిలో ప్రతి లేబరేటరీలో ఆటోమేషన్ ఏర్పాటు చేశారు. టెస్టింగ్ చేసిన ప్రతీ ఒక్కటి రికార్డు కావడంతో పాటు ఫలితాలు ఆటోమేటిక్‌గా సిస్టమ్‌లో నమోదవుతాయి. ఏ ల్యాబ్‌లో ఏ బ్యాచ్ శాంపిల్‌ను ఏ సమయంలో పరీక్షించారో నిర్ధారిస్తూ ఎలాంటి మానవ ప్రమేయం లేకుండా ఈ టెక్నాలజీ నమోదు చేస్తుంది.

వ్యవసాయానికి అండగా..


వ్యవసాయ రంగానికి అండగా ప్రభుత్వం వైఎస్సార్ ల్యాబ్స్‌ను ఏర్పాటు చేయడం సంతోషించదగ్గ విషయం. ఈ జిల్లాలో వ్యవసాయ రంగం తోపాటు పాడి రంగాల్లో రైతులు ఆధారపడి జీవిస్తున్నారు. అందుకు అనుగుణంగా ఆయా ప్రాంతాలను బట్టి ల్యాబ్‌లను ఏర్పాటు చేయడం మంచి పరిణామం.



- దామోదర్‌రెడ్డి, రైతు పోనేటిపాలెం, మదనపల్లి.

ఎప్పటికప్పుడు ఫలితాలు

జిల్లాలో ఇప్పటికే ఐదు ఇంటిగ్రేటెడ్ ల్యాబ్ లు సేవలు అందుబాటులోకి వచ్చాయి. మరొకటి నిర్మాణం పురోగతి దశలో ఉంది. కొద్ది నెలల్లోనే పూర్తి వినియోగంలోకి వచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నాం. గతంలో చాలా ఆలస్యంగా పరీక్షల ఫలితాలు వచ్చేవి. ఇప్పుడు ల్యాబ్‌లు విరివిగా ఏర్పాటు చేయడం వలన ఆ సమస్య ఎదురుకాదు. ఎప్పటికప్పుడు ఫలితాలు రావడం వల్ల రైతులు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు వాడటానికి వీలు పడుతుంది.



- చంద్రనాయక్, జెడిఎ, అన్నమయ్య జిల్లా.

శాశ్వత వ్యవస్థ.. సిఎం సంకల్పం

రైతులకు నాణ్యమైన ఇన్‌పుట్స్ ఇవ్వడానికి శాశ్వతంగా ఓ వ్యవస్థ ఏర్పాటు చేయా లన్నది సిఎం జగన్ మోహన్‌రెడ్డి సంకల్పం. ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌లను తీసుకొచ్చాం. జిల్లాలో ఆరు ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌ల్లో ఐదు వినియోగంలో ఉన్నాయి. మరొకటి పురోగతి నిర్మాణం దశలో ఉంది. వీలైనంత త్వరగా పూర్తి చేయడానికి చర్యలు చేసు కుంటున్నాం. ఆర్బీకేలో కూడా టెస్టింగ్ కిట్స్ పెట్టాం.



- గిరీష, కలెక్టర్, అన్నమయ్య జిల్లా.

విద్యార్థుల సంక్షేమం పట్టని ప్రభుత్వం

- ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

విద్యార్థుల సంక్షేమాన్ని ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్ అన్నారు. శనివారం పట్టణంలోని యుటిఎఫ్ కార్యాలయంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా రెండవ ప్లీనరీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఎస్‌ఎఫ్‌ఐ దేశంలో అందరికీ విద్య, వైద్యం, న్యాయం కోసం నిరవధిక పోరాటం చేస్తున్నదని పేర్కొన్నారు. దేశంలో విద్యా రంగాన్ని విచ్ఛిన్నం చేయడానికి కాషాయ మూకలు నూతన విద్యా విధానాన్ని ముందుకు తీసుకొని వచ్చాయని యుజిసి, మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(ఎంసిఐ) లాంటి సంస్థలను నిర్వీర్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దుర్మార్గపూరితంగా విద్యార్థుల మెదడులో హిజాబ్ అంశాలతో విద్యార్థులను వారిలో ఉన్న సృజనాత్మకతను చీకటి రోజుల్లోకి నెట్టివేసే ప్రయత్నం జరుగుతున్నదని తెలిపారు. వెంటనే విద్యార్థులు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సెక్యులర్ భావాలు కలిగిన దేశంలో మతోన్మాదం మత ఉన్మాదంతో దేశంలో ప్రజాస్వామ్యంనీ కలరస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులందురూ పోరాటాలు ద్వారా హక్కులను కాపాడుకోవాలన్నారు. రాష్ట్రంలో సిఎం జగన్మోహన్‌రెడ్డి ప్రాథమిక విద్యను మొదలుకొని ఉన్నత విద్య వరకు అంగడి సరుకుగా అమ్ముతున్నారన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు హామీలు ప్రకటించి జేబుదొంగ ప్రభుత్వముగా మరో చేత్తోలాక్కుంటున్నాడని విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు కూడా అందించలేదన్నారు. వైద్య రంగాన్ని వైద్య విద్యను అమ్ముకోవడం సరియైన పద్ధతి కాదని పేర్కొన్నారు. జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం పాలక ప్రభుత్వ వ్యాపార ప్రభుత్వము తేల్చుకోవాలన్నారు. విద్యార్థులసంక్షేమంమరిచిపోతే పుట్టగతులు ఉండవని హెచ్చరించారు. సాంఘిక సంక్షేమ వసతి గృహాలు వార్డెన్, డిఎస్‌సి, జూనియర్ లెక్చరర్లు, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, హాస్టల్, స్కూల్, జూనియర్, డిగ్రీ, యూనివర్సిటీ విద్యాసంస్థలకు నిధులు తక్షణమే కేటాయించి యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి కార్తీక్, నరసింహ, జిల్లా ఉపాధ్యక్షుడు రమణ, సహాయ కార్యదర్శి మనోజ్, కోడూరు నాయకులు రమణ, రాజేష్ రాయచోటి చందు, సునీల్ నాయక్, సోను, ఉపేంద్ర, చిన్నరెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న పూల భాస్కర్

కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలి

రాయచోటి: అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రంలో పూర్తిగా ప్రజా వ్యతిరేక పాలన సాగుతుందని, వ్యవస్థలన్నీ నిర్వీర్యమయ్యాయని నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ కన్వీనర్ పూల భాస్కర్ అన్నారు. శనివారం స్థానిక ఎన్‌జిఒ హోమ్‌లో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ వైసిపి, టిడిపి, జనసేన బిజెపికి ఎబిసి టీములుగా ఏర్పడ్డాయని ఆరోపించారు. మణిపూర్‌లో సంఘటనకు అవిశ్వాస తీర్మానం పెడితే మద్దతు తెలియజేయమేంటని ప్రశ్నించారు. ఆ పార్టీలను రాష్ట్రం నుంచి వెలివేయాల్సినటువంటి పరిస్థితి ఉందన్నారు. రాష్ట్ర ప్రజలు వేసే ప్రతి ఓటు కూడా ఆ మూడు పార్టీలకు వేస్తే బిజెపి పార్టీకే వేసినట్లవుతుందన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వస్తే, ప్రత్యేక హోదా, విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ లేకుండా రద్దు చేస్తామనిఇ చెప్పారు. రైతు రుణమాఫీ, ప్రతి రేషన్ కార్డుదారుడికి రూ.500లకే గ్యాస్ సిలిండర్ అందిస్తుందని చెప్పారు. రాహుల్ గాంధీని ప్రధాన మంత్రి చేయడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త సైనికుల్లాగా పనిచేయాలన్నారు. సమావేశంలో నాయకులు అల్లాబకాష్, గోల్డ్ అల్లాబకాష్, చెన్నకృష్ణ, మన్సూర్ అలీఖాన్, రఫీక్షేక్ మొహమ్మద్, అజ్మతుల్లా, మంజునాథ, హఠాన్ ఖాదర్‌వలీ, యహియాబాష, దర్బార్, రమణమ్మ, నాగలత, దినకర్, కాంగ్రెస్ నాయకులు, సోషల్ మీడియా నరేష్, మండల కమిటీ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల అధ్యక్షులు చిన్న రెడ్డయ్య, సురేంద్ర, మైసూరారెడ్డి, వెంకటేశ్వర్లు, నాగయ్య, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-పీలేరు

రాజకీయ అవకాశాలు పత్తందార్లకే కాకుండా గిరిజనులకవి వర్ధించవా అని రాష్ట్రీయ గిరిజన సమైఖ్య (ఆర్‌జిఎస్) నియోజకవర్గం అధ్యక్షులు కిల్లా విజయకుమార్ ప్రశ్నించారు. శనివారం మండలంలోని ఆరెంవారిపల్లి గిరిజన యానాది కాలనీలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాపట్ల జిల్లా, వేటపాలెం మండలం, రామన్నపేట పంచాయతీ, వినాయకపురం ఎస్టీ యానాది కాలనీలో గిరిజన యానాది చేవూరి సత్యంబాబు 6వ వార్డు సభ్యుడుగా ఎన్నికై ఇటీవల మృతి చెందాడన్నారు. అతని మృతితో ఖాళీ అయిన వార్డుకు అతని భార్య చేవూరి మస్తానమ్మను ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని కాలనీ వాసులు నిర్ణయించినందుకు అక్కడున్న కొందరు పెత్తందార్లు అభ్యంతరం తెలుపుతూ, గిరిజన యానాదులపై దాడి చేసి గాయపరిచడం దురదృష్టకరమని పేర్కొన్నారు. వారికి మద్దతు ఇచ్చిన జడ్‌పిటిసి బండ్ల తిరుమలాదేవి ఆమె భర్త బండ్ల బాబుపై కూడా దాడి చేయడం బాధాకరమన్నారు. భర్త చనిపోయిన బాధలో ఉన్న ఆమెను ఓదార్చి వార్డు సభ్యురాలిగా ఏకగ్రీవంగా ఎన్నిక చేయాల్సి ఉండగా ఇలా గిరిజన యానాదులపై దాడి చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. గిరిజనులకు రాజకీయ వారసత్వం రాకూడదాఅని ప్రశ్నించారు. ప్రభుత్వం గిరిజన యానాదులపై దాడి చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని, మృతి చెందిన వార్డు సభ్యుడి స్థానంలో అతని భార్యను ఏకగ్రవంగా ఎన్నిక చేయాలని డిమాండ్ చేశారు.

ఐద్వా నాయకురాలికి పరామర్శ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఐద్వా నాయకులు భాగ్యమ్మ కుమారుడు విజయ్ కుమార్ (26) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. శనివారం పట్టణంలోని విజయనగరం కాలనీలని ఆమె నివాసానికి జిల్లా ఐద్వా అధ్యక్షులు సాయి సుధ, కార్యదర్శి సాయి లక్ష్మీ, చిత్తూరు జిల్లా కార్యదర్శి భువనేశ్వరి, సిపిఎం నాయకులు టి.హరేంద్రనాథ్ శర్మ మదనపల్లెకు చేరుకొని వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐద్వా నాయకులు భాగ్యమ్మ కుమారుడు మృతి చెందడం చాలా బాధాకరమన్నారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేసి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో పలువురు ఐద్వా, సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసులు

జాతీయ స్ఫూర్తితో 14న సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ఈ నెల 14న రాయచోటి పట్టణంలో జాతీయ ఉద్యమ స్ఫూర్తితో సాంస్కృతిక కార్యక్రమాల సభను జనజాగరణ పేరుతో నిర్వహిస్తున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి పి.శ్రీనివాసులు, ప్రజానాట్య మండలి జిల్లా కన్వీనర్ వెంకటాచలపతి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.రామచంద్ర, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కో-కన్వీనర్ డి.సి.వెంకటయ్య పేర్కొన్నారు. శనివారం సిఐటియు జిల్లా కార్యాలయంలో ప్రజాసంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కులమతాలకనుగుణంగా నాడు స్వాతంత్రోద్యమ కాలంలో ఆశేష భారతావని బ్రిటీష్ సామ్రాజ్యవాదుల్ని తరిమికొట్టారని పేర్కొన్నారురు. అదే స్ఫూర్తితో అంతర్జాతీయ పెట్టుబడిదారులను భుజాన మోస్తున్న దేశీయ కార్పొరేట్ శక్తుల విధానాల వలన ప్రజలు, రైతులు, నిరుద్యోగులు, మహిళలను శ్రమ దోపిడి చేశారని తెలిపారు. రైతుల వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లతో పాటు వ్యవసాయ నల్ల చట్టాలను తీసుకొచ్చి దేశాన్ని అభివృద్ధిలో వెనక్కి నెడుతున్నారని విమర్శించారు. ఈ దేశ దౌర్భాగ్యమైన పరిస్థితుల నుండి బయటపడేందుకు ప్రజలను చైతన్యం చేయుటకు 14న సాంస్కృతిక కార్యక్రమాల సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వి.రమణారెడ్డి, ఉపాధ్యక్షులు కె.నాగబసిరెడ్డి, సిఐటియు జిల్లా కార్యదర్శి డి.భాగ్యలక్ష్మి, ఉపాధ్యక్షులు ఎస్.ఓబులమ్మ, ఎస్‌ఎఫ్‌ఐ, కెవిపిఎస్ నాయకులు దిలీప్, నిరంజన్, గోవింద్ పాల్గొన్నారు

నేడు గద్దర్ సంతాప సభ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

విసికె పార్టీ, భారతీయ అంబేద్కర్ సేన (బాస్) సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో ప్రజాగాయకుడు గద్దర్ సంతాప ర్యాలీ, సభ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పిటిఎం శివప్రసాద్, ముత్యాల మోహన్, పోతబోలు రెడ్డెప్ప, బురుజు లక్ష్మీనారాయణ, వి.మునివెంకటప్ప, నీరుగట్టి రమణ, చాట్ల బయన్న, కోనేటి దివాకర్ ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు మిషన్ కాంపౌండ్ వద్ద గద్దర్ చిత్రపటంతో సంతాప ర్యాలీ ప్రారంభమై, జిఆర్‌టి హైస్కూల్ వరకు కొనసాగుతుందన్నారు. అనంతరం అక్కడే సంతాప సభ నిర్వహిస్తామన్నారు. గద్దర్ అభిమానులు, కవులు, కళాకారులు, రచయితలు, మేధావులు, ప్రగతిశీల సంఘాల ప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు సంతాప కార్యక్రమాలలో పాల్గొని జయప్రదం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

పారిశుద్ధ్య కార్మికుల కృషి ఎనలేనిది

- సఫాయి కర్మచారీ జాతీయ కమిషన్ చైర్మన్ ఎం.వెంకటేషన్



ఎం.వెంకటేషన్‌ను సన్మానిస్తున్న కలెక్టర్, ఎస్‌పి, అధికారులు

ప్రజాశక్తి-రాయచోటి

సమాజం ఆరోగ్యంగా, ఆహ్లాదకరంగా ఉందంటే సఫాయి కర్మచారుల జీవన ప్రమాణాలను మెరుగుపరచాలని, సఫాయి కర్మ చారీ పారిశుధ్య కార్మికుల కృషే కారణమని సఫాయీ కర్మచారీ జాతీయ కమిషన్ చైర్మన్ ఎం.వెంకటేషన్ కొనియాడారు. శనివారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్లో సఫాయీ కర్మచారీల కోసం జిల్లా యంత్రాంగం అమలు చేస్తున్న పథకాల పురోగతిపై కలెక్టర్ గిరీష, ఎస్‌పి గంగాధర్‌రావు, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, జిల్లా అధికారులతో వెంకటేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల అభ్యున్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ చేరేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వాలు అందజేస్తున్న పథకాలు సకాలంలో కార్మికులకు అందుతున్నాయా? లేదా? అన్న విషయాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం సఫాయి కర్మ చారి వృత్తి చేస్తున్న వారి కోసం తీసుకువస్తున్న సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో సక్రమంగా అమలు అయినప్పుడే వారి అభివృద్ధి సాధ్యమన్నారు. దేశాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో సఫాయి కార్మికుల చేస్తున్న కృషి ఎనలేనిదని పేర్కొన్నారు. అత్యంత ప్రమాదకరమైన డ్రైనేజీల్లో దిగి వాటిని శుభ్రపరుస్తూ ఎంతో మంది మ ృతిచెందారని అన్నారు. అలాంటి వారి కుటుంబాలకు ప్రభుత్వం తరుపున అందిస్తున్న నష్టపరిహారాన్ని తక్షణమే అందించాలని ఆదేశించారు. అనంతరం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి సభకు హాజరైన కర్మచారులను, వివిధ సంఘాల ప్రతినిధులను, వారికి ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా కేంద్రం రాయచోటిలో ఒక ఈఎస్‌ఐ హాస్పిటల్ నిర్మించాలని కోరగా చైర్మన్ సానుకూలంగా స్పందించారు. ఇల్లు లేని వారికి ఇళ్ల పట్టాలను ఇవ్వవలసిందిగా కోరగా అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఇళ్ల పట్టా ఇవ్వడమనేది పాలసీ మేటర్ అని, సఫారీ కర్మచారుల లో ఇల్లు లేని వారికి కు ఇళ్ల పట్టా ఇవ్వడం గురించి సీఎంవోకి తెలియజేశామని త్వరలోనే దానికి సమాధానం రావచ్చని కలెక్టర్ చైర్మన్‌కి తెలిపారు. కార్మికులకు పిఎఫ్, ఇఎస్‌ఐ నెంబరు తదితర వాటిని గుర్తుంచుకోవాలని వారికి సూచించారు. ఐడి కార్డుల మీద ఆ నంబరు తదితర ముఖ్యమైన నెంబర్లను ప్రింట్ అయ్యేలా చూడాలని కలెక్టర్‌కి సూచించారు. కలెక్టర్ గిరీష మాట్లాడుతూ అధికారులందరూ సఫాయి కర్మచారుల సమస్యలను నిర్ణీత కాల పరిమితిలో పూర్తి చేయాలని, ప్రావిడెంట్ ఫండ్, ఇఎస్‌ఐ తదితర వాటి గురించి అవగాహన కార్యక్రమాలను చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఎస్పీ గంగాధర్‌రావు మాట్లాడుతూ సఫాయి కర్మచారి చట్టం 2013 చాలా బలమైనదని, వారి గురించి అన్ని విషయాలు చట్టంలో చేర్చబడ్డాయని వారి పరిరక్షణకు అన్ని చర్యలు చేపడుతున్నామని, ఫోన్ కాల్ చేసి వారి సమస్యలను తెలియజేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ సత్యనారాయణ, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు. అంతకుముందు డిపిఒ ధనలక్ష్మి సఫాయి కర్మచారులకు జిల్లాలో చేపడుతున్న వివిధ సంక్షేమ పథకాలు, వారి స్థితిగతుల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా చైర్మన్‌కు వివరించారు. జిల్లాలో 554 గ్రామాలు ఉన్నాయని అన్ని గ్రామాలు బహిరంగ మలవిసర్జన రహిత గ్రామాలుగా గుర్తించబడ్డాయని, 548 గ్రామాలలో ఘన వ్యర్థాల నిర్వహణ జరుగుతోందని తెలిపారు. జిల్లాలో 1291 క్లాప్ మిత్రాలు ఉన్నారని, పట్టణ ప్రాంతాలలో 163 మంది శాశ్వత సఫాయి కర్మచారులు పనిచేస్తున్నారని తెలిపారు. జిల్లాలో పారిశుధ్యానికి వాడుతున్న ట్రై సైకిల్స్, ట్రాక్టర్స్, ఇన్ సెనెరేటర్స్, తదితర యంత్రాల గురించి చైర్మన్‌కు వివరించారు.

పోరుబాట

ప్రజా'దృష్టి'

జిల్లాలో కార్మికుల నుంచి ప్రతిఘటన పెరుగుతోంది. ఇటీవల కలెక్టరేట్ ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ ఉద్యోగులకు గత సార్వత్రిక ఎన్నికల ప్రచార సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ సమరశీల పోరాటం చర్చనీయాంశంగా మారింది. మున్సిపల్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలనే న్యాయమైన డిమాండ్ పట్ల ఎందుకు స్పందించడం లేదో పాలకులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది. అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, క్యాబ్ డ్రైవర్లకు రూ.18,500 ఇవ్వాలని, సుప్రీం కోర్టు తీర్పు మేరకు సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని, పర్మినెంట్ ఉద్యోగులకు సిపిఎస్ రద్దు చేసి పాత విధానం ప్రకారం పింఛన్ ఇవ్వాలని, ఇంజినీరింగ్ సెక్షన్ వారికి స్కిల్డ్, సెమీస్కిల్డ్ వేతనాలు ఇవ్వాలని, మరణించిన, అనారోగ్య ఉద్యోగుల కుటుంబాలకు ఉద్యోగాలివ్వాలనే న్యాయబద్ధమైన డిమాండ్లను అమలు చేయాలని కోరుతూ చేసిన సమరశీల పోరాటం ఆలోచనల్ని కలిగించింది. ఉద్యమాల అణచివేతకు పోలీసులను సాధనంగా వాడుకుని అరెస్టు చేయాలని చూడడం, ఈడ్చిపారేయడానికి ప్రయత్నించడం, పలువురు గాయపడడం వంటి పోరాట దృశ్యాలు సమరశీల పోరాటం తీవ్రతను తెలియజేశాయనడంలో సందేహం లేదు. పోరాటాన్ని అణచివేత పొరుగు రాష్ట్రమైన తెలంగాణలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేసిన తరహాలోనే ఇక్కడా చేయాలనే న్యాయమైన డిమాండ్‌ను ఆలకించాల్సి ఉంది. 2019 సార్వత్రిక ఎన్నికల సమయంలో అడిగిన వారికి అడిగిన చందంగా వాగ్దానాలు చేసిన పాలకులు, గద్దెనెక్కిన తర్వాత మరిచిపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటికే 98 శాతం హామీలను నెరవేర్చామని చెప్పుకుంటున్న పాలకులు మున్సిపల్ ఉద్యోగులను ఎందుకు రెగ్యులర్ చేయడం లేదో సమాధానం చెప్పాల్సి ఉంది. 2024 సార్వత్రిక ఎన్నికలు తరుముతున్న నేపథ్యంలో కార్మిక నాయకత్వం ఉద్యమాన్ని తీవ్రతరం చేయాలి. పోరాటాల ద్వారానే ఫలితాలు ఉంటాయనే చారిత్రక సత్యాల్ని పోరాటకారులు గమనంలో ఉంచుకోవాలి. ఇటువంటి వివక్ష, బానిసత్వాలకు వ్యతిరేకంగా ఆదిమయుగం నుంచి ఆధునిక డిజిటల్ యుగం రూపు దాల్చే వరకు పోరాటమే ఇరుసుగా నడక సాగిందనే సత్యాన్ని కార్మిక శ్రేణులకు నూరిపోయాలి. ఇటువంటి సజీవ సత్యాలే ఉద్యమాల్ని మరింత ఉవ్వెత్తిన ఎగిసిపడేలా చేస్తాయని చెప్పవచ్చు. లేనిపక్షంలో భవిష్యత్ తరాలు నష్టపోతాయనే స్పృహను కలిగి నడుచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో వ్యత్యాసాల్ని, వివక్షల్ని బానిస బతుకులకు విముక్తి పోరాటాల రూపంలోనే అన్వేషించాల్సి ఉందనే సత్యాన్ని అర్థమయ్యేలా విడమరిచి చెప్పాలి. ఇటువంటి తిరోగమన విధానాల్ని ఐకమత్యంతో సమర్థవంతంగా తిప్పికొట్టి తీరాల్సిందే. ఇందుకు కార్మిక లోకమంతా ఉవ్వెత్తున ఉమ్మడిగా కదిలితేనే ప్రయోజనం. లేని పక్షంలో మరో సార్వత్రిక ఎన్నిక వచ్చే వరకు బానిస, వివక్షలనే సంకెళ్లలోనే మగ్గిపోవాల్సి వస్తోందనే సత్యాన్ని గమనంలో ఉంచుకోవాలి. పోరాడితే పోయేవి బానిస సంకెళ్లు తప్పా మరేమీ లేదనే సత్యాన్ని పోరాట నాయకత్వం ఎలుగెత్తి చాటాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పవచ్చు. కార్మిక ఉద్యమాల తరహాలో కర్షకులు సైతం ఉద్యమిస్తేనే రైతాంగ సమస్యలు పరిష్కారమవుతాయని అర్థం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందనడంలో సందేహం లేదు.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి



రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

చెరువును తలపిస్తున్న రోడ్లు

పట్టని అధికారులు - ఇబ్బందుల్లో ప్రజలు

ప్రజాశక్తి-కలకడ

మండల కేంద్రమైన కలకడలో చిన్నపాటి చినుకులకే రోడ్లు చెరువును తలపిస్తున్నాయి. పట్టణంలోని పోస్టాఫీసు నుంచి చెరువు బండ వీధికి పోయే దారిలో వర్షపు నీటితో నిండిపోయింది. ఈ రోడ్డులో రాకపోకలు సాగించాలంటే వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షపు నీనీరు నిల్వ ఉండటంతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి.పగలు, రాత్రి అనే తేడా లేకుండా ప్రజల రక్తాన్ని పీల్చుతున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిన్న పిల్లలు ఎక్కువగా డెంగీ,మలేరియా, టైఫాయిడ్ లాంటి జ్వరాల బారిన పడుతున్నారని వాపోయారు. ఇప్పటి వరకు సంబంధిత అధికారులు గాని, ప్రజా ప్రతినిధులు గాని పట్టించుకున్న దాఖలాలు లేవని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్ల పై నిలిచిన మురుగునీటిని తొలగించేందుకు చర్యలు తీసుకొని ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని కోరుతున్నారు.

నాడు-నేడు పనులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి- సుండుపల్లి

రెండో విడత నాడు-నేడు పనులు ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని ఎంఇఒ వెంకటేశ్వర్ల నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాడు-నేడు కార్యక్రమంలో జరుగుతున్న పనులను పూర్తిగా వేగతవంగా జరుగుతున్నాయని అన్నారు. కొన్ని భవనాలు మధ్య లోనే ఆగిపోయాయని వాటిని కూడా పూర్తి చేయాలని కోరారు. మండంలో దాదాపు 34 అంగన్వాడీ కేంద్రాలు మంజూరయ్యాయని అవి కూడా మధ్యలోనే ఆగియాయని, వెంటనే జరిగాయని అవి కూడా వెంటనే పూర్తి చేసే వరకు చేయాలని ఆయన కోరారు.



భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఉప్పుశెట్టి సుధీర్

జాతరలో అన్నదానం

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని అరవపల్లెలోని శ్రీ ముత్తుమారెమ్మ జాతర మహోత్సవాలలో ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ఉదయం వేద పండితులు బండాత్మకూరు శివకుమార్ శర్మ ఆధ్వర్యంలో మహిళలు పెద్ద ఎత్తున కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం ఉప్పు శెట్టి సుధీర్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం అమ్మవారు ప్రత్యేక అలంకరణలో పురవీధుల గుండా స్థానిక బస్టాండ్ కూడలి వరకు డప్పు వాయిద్యాలు బాణాసంచా పేలుస్తూ చెక్కభజన, కాళికా నృత్యం, విచిత్ర వేషధారణ, కేరళ వాయిద్యంతో గ్రామోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహిం చారు. గ్రామోత్సవానికి ముఖ్యఅతిథిగా రాజంపేట నియోజకవర్గ యువ నాయకుడు మేడా విజయశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



పాఠశాలలో మొక్కలు నాటుతున్న ఎస్‌బిఐ మేనేజర్ వెంకటేశ్వర్లు

పచ్చని చెట్లతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి-పీలేరు


విద్యాలయాల ప్రాంగణాల్లో పచ్చని చెట్లు ఉంటే పిల్లలకు ఎంతో ఆరోగ్యమని పీలేరు ఎస్‌బిఐ మేనేజర్ వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం కె.వి పల్లి మండలం, గ్యారంపల్లి ఎపిఆర్‌ఎసి ఆవరణంలో ఎస్‌బిఐ సహకారంతో 150 పండ్ల మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ మొక్కలు పెంచితే పచ్చదనంతో పాటు విద్యార్థులకు మంచి ఆరోగ్యం లభిస్తుందని, అలాగే ఆక్సిజన్ పుష్కలంగా లభించి జ్ఞాపకశక్తి వృద్ధి చెందుతుందని తెలిపారు. సపోటా, జామ, మామిడి, నిమ్మ, చింత మొదలగు పండ్ల మొక్కలు నాటడంలో చేయూతనందించిన మేనేజరుకు ప్రిన్సిపల్ డాక్టర్ చెన్నకేశవులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ చెన్నకేశవులు, అధ్యాపకులు భూపతి, రామకృష్ణ, అన్నపూర్ణ, హరినాథ్, వెంకటరమణ, సౌజన్య, కొండయ్య పాల్గొన్నారు.

కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన

గాలివీడు : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరానికి 36 మంది హాజరు కాగా అందులో కంటి పరీక్షకు 20 మందిని ఎంపిక చేసినట్లు ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ రఫీ పేర్కొన్నారు. వైఎస్‌ఆర్ జిల్లాకు చెందిన కంటి వైద్య నిపుణులు డాక్టర్ మాధవి ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు చేశారు.

ఆలయానికి బీరువా బహూకరణ

తంబళ్లపల్లి : తంబళ్లపల్లె సమీపంలోని మల్లయ్య కొండపై వెలసిన శ్రీ భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి ఆలయానికి మండలంలోని గోల్లపల్లికి చెందిన రైస్‌మిల్ సుజాతలు లక్షరూపాయల విలువ చేసే ఇనుప బీరువాను శనివారం విరాళంగా అందించారు. ఇనుప పెట్టె రెండు టన్నుల ఇనుముతో ప్రత్యేకంగా చేయించారు. ఆ పెట్టెను వాహనంలో మల్లెకొండకు చేర్చారు. జెసిపి సహాయంతో ఆ పెట్టెను ఆలయంలోకి చేర్చి అమర్చారు. ఆ పెట్టెలో భక్తులు ఇచ్చే విలువైన కానుకలను భద్రపరిచేందుకు వీలు కలిగింది .వారి కుటుంబ సభ్యులు మంజునాథరెడ్డి, ఉదయశ్రీ, భాస్కర్ రెడ్డి, లక్ష్మీదేవిలను పూజారులు ఈశ్వరప్ప, మల్లికార్జునలు సాధనంగా ఆహ్వానించి స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామివారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందించారు. దాతలను ఆలయ కమిటీ చైర్మన్ మర్రెడ్డి, ముద్దులదొడ్డి గంధర్వరెడ్డి, ఆలయ ధర్మకర్త ప్రభాకర్ రెడ్డిలు అభినందించారు.



ఆలయ కమిటీ సభ్యులకు బీరువాను అందిస్తున్న భక్తులు

ప్రజల వద్దకే సంక్షేమ ఫలాలు : 'చింతల'

ప్రజాశక్తి-కలకడ

ప్రజల వద్దకే సంక్షేమ ఫలాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తెలిపారు. మండలంలోని ఏనుగొండపాలెం పంచాయతీ చీకిశెట్టిపల్లి, కోరేవాండ్లపల్లి, ఎగువ పాలెం, గొల్లపల్లి, వంటిల్లు, రంగప్ప గారిపల్లి, తదితర గ్రామాలలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ ఫలాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేదలకు సంక్షేమ పథకాలు అందించడంలో సిఎం జగన్ అహర్నిశలు కష్టపడి పని చేస్తున్నారన్నారు. ప్రజా సంక్షేమ ఫలాలు ప్రజలకు నేరుగా అందేలా చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అంచలంచలుగా 95 శాతం పూర్తి చేశారని తెలిపారు. ప్రతి మహిళ ఆర్థికంగా ఎదగాలని ఉద్దేశ్యంతో డ్వాక్రా రుణాలు అందజేస్తూ మహిళల రుణం తీర్చుకుంటున్నారని అన్నారు. గామాల పరిధిలో ఉన్న ప్రజలకు సర్టిఫికెట్లను తీసుకువచ్చి, అక్కడే ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఘనత ముఖ్యమంత్రికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపిపి శ్రీదేవిరవికుమార్, మండల సచివాలయ కన్వీనర్ మోహన్రాజనాయుడు, సర్పంచ్ మంజుల, వైస్ ఎంపిపి ఈశ్వర్ నాయుడు, తహశీల్దార్ ప్రదీప్, సిఐ నాగేంద్ర, ఎస్ఐ తిప్పేస్వామి, పోలీస్‌సిబ్బంది, జూనియర్ అసిస్టెంట్ బాషామొహద్దీన్, వైసిపి నాయకులు, రవికుమార్, శివ ప్రసాద్, కుమార్ నాయుడు, బాబురెడ్డి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

ఆరోగ్య పరీక్షలు చేయించుకున్న ఎమ్మెల్యే

మండలంలోని ఏనుగుంటపాలెం పంచాయతీ లోని రంగప్పగారిపల్లి, కోరేవాండ్లపల్లి, గ్రామాల్లో జరుగుతున్న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఏర్పాటుచేసిన హెల్త్ సెంటర్లో ఆరోగ్య పరీక్షలు, రోగులకు ఇస్తున్న మందులను ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తనిఖీలు నిర్వహించారు. అనంతరం వైద్యులచే వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ప్రస్తుతం వర్షాకాలం కాబట్టి సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి



సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే

ప్రజలకు సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. కార్యక్రమంలో ఎర్రకోటపల్లి ప్రాథమిక వైద్యాధికారి కిషోర్ కుమార్‌రెడ్డి, జోహార్‌బాబు ఎంపిహెచ్‌ఇఒ జయరామయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నిమ్మనపల్లె : ప్రజలకు మంచి చేయడమే వైసిపి ప్రభుత్వ విధానమని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. అగ్రహారం పంచాయతీలోని మంచుగుంటపల్లి, అగ్రహారం గ్రామాలలో సర్పంచ్ వి.ఉషారాణి, ఎంపిటిసి కుసుమ, వైసిపి నాయకులు యుగంధర్ రెడ్డి ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఎంపిపి నరసింహులు, సింగిల్ విండో అధ్యక్షులు రెడ్డిశేఖర్‌రెడ్డి, మండల వైసిపి ఇన్‌ఛార్జి ఆర్‌ఐ రమణారెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ రామ మోహన్ రెడ్డి లతో కలసి ఇంటింటికి వెళ్లారు. ప్రజల యోగక్షేమాలను విచారిస్తూ గత నాలుగేళ్లుగా ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధికి సంబంధించిన బుక్ లెట్ ను అందించారు. కార్యక్రమంలో సర్పంచులు సుబ్రమణ్యం, చంద్రాయుడు, మహాదేవరెడ్డి, వైస్ ఎంపిపి జయప్రకాశ్‌రెడ్డి, నాయకులు యుగంధర్‌రెడ్డి, కైలాసపతి, దయాకర్ రెడ్డి, ఉదయ శేఖర్ రెడ్డి, నరేంద్ర రెడ్డి, సుధాకర, వెంకటరమణ, శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, వెంకటరమణారెడ్డి, వాలంటీర్లు, కో-ఆర్డినేటర్ మౌలాలి పాల్గొన్నారు.

పాపం.. పసివాడు

చిన్న బిడ్డకు పెద్ద జబ్బు
రోజుకు రూ.పది వేల ఇంజక్షన్
దిక్కుతోచని స్థితిలో తల్లిదండ్రులు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రిహాన్



రిహాన్ (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి-కురబలకోట

చిన్న బిడ్డ రిహాన్ పెద్ద జబ్బుతో బాధపడుతున్నాడు. ఖరీదైన జబ్బు కావడంతో రెక్కాడితే గాని డొక్కాడని నిస్సహాయ తల్లిదండ్రులు దిక్కుతోచని స్థితిలో తల్లడిల్లుతున్నారు. కుటుంబ పోషణే వారికి భారం. దీనికి తోడు ఒక్కడే కుమారుడు. ఎలా కాపాడుకోవాలో తెలియక కళ్ల ముందే బిడ్డ ఆస్పత్రిలో నరకయాతన పడుతుండడంతో కన్న ప్రేగు విలవిలలాడుతోంది. ఆదుకునే ఆపన్న హస్తం కోసం వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు. కురబలకోటకు చెందిన రియాజ్, గౌసియా బాధితుల కథనం మేరకు.. వృతిరీత్యా తాము చేనేత కార్మికుమని తెలిపారు. తమకు 14 నెలల రిహన్ అనే కొడుకు ఉన్నాడని చెప్పారు. మదనపల్లెలోని నీరుగట్టువారిపల్లెలో స్థిరపడ్డామన్నారు. తమ కొడుకు పుట్టినప్పుడే మూడు న్నర కిలోల బరువు ఉండేవాడని, ఆరోగ్యంగా ఉన్నాడని భావించా మన్నారు. తీరా చూస్తే రోజు రోజుకు కడుపు ఉబ్బి పోవడాన్ని గుర్తించామని, పులివెందుల ప్రభుత్వ ఆస్పత్రిలో రెండు వారాల పాటు చూపించారు. అక్కడ వైద్యులు పరీక్షలు చేసి బిడ్డకు అరుదైన వ్యాధి ఉన్నట్లు గుర్తించి బెంగళూరులోని సెయింట్ జాన్ అనుపత్రికి సిఫారసు చేశారని తెలిపారు. 14 రోజుల క్రితం ఆ ఆసుపత్రిలో చేర్పించామన్నారు. అక్కడ వివిధ పరీక్షలు నిర్వహించి బాలుడికి కిడ్నీ సమస్య, థైరాయిడ్, లివర్, యూరినరీ సమస్యతో పాటు రక్తం ఇన్ఫెక్షన్ అవుతున్నట్లు గుర్తించారని అన్నారు. నెలల బిడ్డకు ఇన్ని సమస్యలు ఉన్నట్లు పరీక్షల్లో వెల్లడి కావడంతో అసుపత్రి వైద్యులు కూడా ఆందోలన వ్యక్తం చేశారని అన్నారు. రోజుకు రూ.10 వేలు విలువ చేసే ఇంజక్షన్ ఇస్తున్నట్లు చెబుతున్నారు. లక్షలు ఖర్చవుతుందని అంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.శక్తికి మించి ఆస్పత్రి ఖర్చులు అవుతున్నాయని, తమ బిడ్డను బతికించుకోవాలని ఎంతగానో తాపత్రయ పడుతున్నామన్నారు. ఇప్పటికే శక్తికి మిం అప్పులు చేశామని విలపించారు. తమకు ఎలాంటి ఆస్థి పాస్తులు లేవని ఉన్న చిన్నపాటి ఇంటిని కూడా తనఖా పెట్టా మన్నారు. బిడ్డ ప్రాణం గాలిలో దీపంలా మారిందని బోరునా విలపించారు. ఈ వ్యాధికి ఆరోగ్యశ్రీ పథకం వర్తిస్తుందో లేదో కూడా తెలీదన్నారు. మరో వైపు చిన్నారి వళ్లంతా రోజు రోజుకు ఉబ్బిపో తుండ టంతో భయాందోళన చెందు తున్నారు. చిన్నారికి బతుకు నివ్వడానికి గొప్ప మనసున్న వారితోనే సాధ్య మని, మనసున్న దాతలు ఆదుకొని తమ బిడ్డ ప్రాణాలను కాపాడాలని ముఖిలిత హస్తాలతో వేడుకుంటున్నారు.

రాష్ట్రాభివృద్ధి టిడిపితోనే సాధ్యం : 'బత్యాల'



టిడిపి మేనిఫెస్టో గురించి వివరిస్తున్న బత్యాల చెంగల్రాయుడు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాష్ట్రాభివృద్ధి టిడిపితోనే సాధ్యమని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాజంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి బత్యాల చెంగల్రాయుడు పేర్కొన్నారు. టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఆదేశాలు మేరకు శనివారం రాజంపేట పట్టణంలోని నూనెవారి పల్లిలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి చంద్రబాబు ప్రకటించిన మినీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బత్యాల మాట్లాడుతూ మేనిఫెస్టోలో మహిళా సంక్షేమం కోసం పెద్దపీట వేశారన్నారు. అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతిని దృష్టిలో ఉంచుకుని మేనిఫెస్టో తయారు చేశారని చెప్పారు. వైసిపి పాలనలో రాష్ట్రం వందేళ్లు వెనక్కి వెళ్లిందని, రాష్ట్ర ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల వల్ల ప్రజలు తమ భవిష్యత్తును కోల్పోయారని అన్నారు. రానున్న ఎన్నికలలో టిడిపి మళ్లీ అధికారం చేపట్టి ప్రజల బంగారు భవిష్యత్తుకు నాంది పలుకుతుందని తెలిపారు. కార్యక్రమంలో టిడిపినాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'సివిఆర్ ఆగ్రోఫామ్' సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-కలికిరి

సివిఆర్ ఆగ్రో ఫామ్ అధినేత చింతపర్తి రామకృష్ణారెడ్డి సేవలు అభినందనీయమని ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వై.పవన్ కుమార్ అన్నారు. శనివారం సివిఆర్ ఆగ్రో ఫామ్ వ్యవస్థాపకులు చింతపర్తి రామక్రిష్ణారెడ్డి ఆధ్వర్యంలో కలికిరి ప్రభుత్వాసుపత్రిలో రోగులకు, ఆసుపత్రి సిబ్బందికి సేంద్రియ ఎరువులతో పండించిన రూ.30వేలు విలువ చేసే దాదాపు 200కిలోల డ్రాగన్ ఫ్రూట్స్‌ను ఆసుపత్రి సూపరిం టెండెంట్ పవన్‌కుమార్ చేతుల మీదుగా ఉచితంగా అందించారు. ఆస్పత్రి ఆవరణలో రోగులు కూర్చోవడానికి 4 సిమెంట్ బల్లలను, తన తండ్రి సివిరెడ్డి జ్ఞాపకార్థం రామక్రిష్ణా రెడ్డి వితరణ చేశారు. ఈ సంధర్భంగా మాట్లా డుతూ సేంద్రియ ఎరువుల ద్వారా పండించే డ్రాగన్ ఫూట్స్ షుగర్ వ్యాధి గ్రస్తులకు చాలా మంచిదని, ఎవరైనా తినవచ్చునని అన్నారు. రామక్రిష్ణారెడ్డి మాటాడుతూ సేంద్రియ వ్యవసాయ పద్ధతిలో పండించిన డ్రాగన్ ఫ్రూట్స్ ను తాము అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా కిలో రూ.150లకే అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రెడ్డి జెఎసి గౌరవాధ్యక్షులు వై.ఆదినారాయణ రెడ్డి, అధ్యక్షులు పులి సత్యనారాయణ రెడ్డి, రెడ్డి సభ్యులు రెడ్డప్ప రెడ్డి, రాజారెడ్డి, జనార్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.



సూపరింటెండెంట్‌కు డ్రాగన్ ఫ్రూట్స్ అందిస్తున్న రామకృష్ణారెడ్డి

ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టండి

- పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కేంద్రంలో బిజెపి,రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వ విధానాలను ఎండగట్టాలని, ఈ ప్రభుత్వాలు రాహు,కేతువుల్లా తయార య్యారని కాంగ్రెస్ పార్టీ ఎపిసిసి మీడియా చైర్మన్ తులసి రెడ్డి పేర్కొన్నారు.శనివారం మదనపల్లె పట్టణం బెంగళూరు బస్టాండ్ నందు దివంగత ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. మదనపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కో-ఆర్డినేషన్ సమావేశం పట్టణ అధ్యక్షులు రెడ్డిసాహెబ్ ఆధ్వర్యంలో నియోజకవర్గం కన్వీనర్ లీలాశ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది.ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం దేశాన్ని అప్పుల పాలు చేసిందని ఆరోపించారు.1947 నుండి 2014 వరకు 67 సంవత్సరాలలో 13 మంది ప్రధాన మంత్రుల కాలంలో కేంద్ర ప్రభుత్వం చేసిన అప్పు 46 లక్షలు కోట్ల రూపాయలు,కేవలం 9 ఏళ్లలో నరేంద్ర మోదీ ప్రభుత్వం చేసిన అదనపు అప్పు 109 లక్షల కోట్ల అప్పు అని నిప్పులు చెరిగారు.అంతేకాకుండా దేశాన్ని అమ్మకానికి పెట్టారన్నారు. నియోజకవర్గం కన్వినర్ లీలా శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడం కోసం,కమిటీల నిర్మాణాన్ని పూర్తి చేసుకొని అందరిని సమన్వయం చేసుకొని పార్టీని ముందుకు తీసుకెళ్లాడానికి గట్టి ప్రయత్నం చేస్తామని వెల్లడించారు. చివరగా మదనపల్లి పట్టణ అధ్యక్షులు రెడ్డి సాహెబ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆదేశాలు మేరకు కమిటీల నిర్మాణం పూర్తి చేసుకొంటూ,పార్టీని క్షేత్రస్థాయి నుంచి అభివృద్ధి చేసే దిశగా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.పెద్దల ఆశీస్సులతో కాంగ్రెస్ పార్టీని అభివృద్ధి వైపు నడిపిస్తూ రానున్న ఎన్నికలకు సమాయాత్తం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎం.ఎన్. చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ కె.మీనాకుమారి, మహబూబ్‌పేర్, సురేంద్ర రెడ్డి,రామచంద్రయాదవ్, ఖాదర్ బాషా, చలపతి, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తులసిరెడ్డి

జీవితం విలువ తెలుసుకోవాలి : సిఐ

మదనపల్లె అర్బన్ : జీవితం విలువ తెలుసుకొని ప్రతి వ్యక్తి తనకు తాను సమాధానపరుచుకున్నప్పుడే తాను ప్రశాంతంగా జీవించవచ్చునని మదనపల్లి టూ టౌన్ సిఐ ఎస్. మురళీకృష్ణ తెలిపారు. శనివారం స్థానిక సబ్ జైలు ఆవరణలో పరివర్తన కౌన్సిలింగ్ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. క్షణికావేశంలో నేరం చేసి అయిన వాళ్లకు అప్తులకు దూరమై చాలామంది జీవితాలు దుర్భరమయ్యాయని ఏదైనా ఒక నిర్ణయం తీసుకునేటప్పుడు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలన్నారు.ప్రముఖ వైద్యురాలు సైకియాట్రిస్ట్ డాక్టర్ రాధిక మాట్లాడుతూ శారీరక మరియు మానసిక ఆరోగ్యం ఉన్నప్పుడే మనిషి సక్రమంగా జీవించగలుగుతారని పేర్కొన్నారు. సూపరిండెంట్ రామకృష్ణయాదవ్ మాట్లాడుతూ తెలిసో తెలియకో క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయాల ఫలితంగా చాలా ఇబ్బందులకు గురవుతారని అన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి

మండలాన్ని అగ్రభాగాన నిలపడమే లక్ష్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి -బి.కొత్తకోట

మండలాన్ని అభివృద్ధి పరిచి నియోజకవర్గంలో అగ్రభాగాన నిలపాలని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం నగర పంచాయతీ, ఎంపిడిఒ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర పంచాయతీ పరిధిలో మురుగునీటి కాలువలను నిర్మించడానికి, నీటి సమస్య లేకుండా చూడడం, అర్హులైన వారికి 90 రోజుల్లో గృహనిర్మాణ పథకంకింద గృహాలు మంజూరుకి కృషి చేయాలన్నారు. విధులు నిర్వహణలో నిర్లక్ష్యం వ్యవహరించకుండా సకాలంలో పనులు చేసి ప్రజల నుంచి మన్ననలు పొందాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. మండలంలో శాఖల వారీగా పనితీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడు ఖలీల్ అహ్మద్, ఎంపిడిఒ శంకరయ్య, నగర పంచాయతీ ఆర్ఐ శ్రీనివాసులు, రెవెన్యూ ఆర్ఐఐ బాలాజీ, సచివాలయం కన్వీనర్లు శెట్టిపల్లి రమేష్‌రెడ్డి, కంచి కళ్యాణ్ కుమార్ రెడ్డి, సి.ఆర్.చిన్నికృష్ణ, ఎస్.ఎస్.ఫయాజ్, నక్క సంతోష్, జివి.రామకృష్ణ,వరప్రసాద్, జిఎం చాంద్‌బాషా, పాకాల అంజమ్మ, వైసిపి జిల్లా ప్రచార కార్యదర్శి అయూబ్ బాషా, కంచి కోదండ,భీమగాని ప్రభాకర్‌రెడ్డి, కంచి బలరాంరెడ్డి, విఆరఒలు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

'ఉపాధి' బిల్లులు చెల్లించాలి

ప్రజాశక్తి-సుండుపల్లె

మండలంలోని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్నటువంటి ఉపాధి కూలీలు బిల్లులు చెల్లించాలని శనివారం ఉపాధి కూలీలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పెట్టిన ఉపాధి హామీ పథకంలో భాగంగా ప్రతిరోజూ పనులు చేస్తుంటే ఆ పనులకు సంబంధించిన బిల్లులు ఇంతవరకు నెలలు గడుస్తున్నా తమ ఖాతాలో జమ చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం పై ఎంపిడిఒ, అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన కూడా ఎలాంటి ప్రయోజనం లేదని అన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఉపాధి బిల్లులు వెంటనే చెల్లించాలని కోరారు.



గ్రామ పెద్దలకు విరాళాన్ని అందిస్తున్న జయచంద్రారెడ్డి

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం


ప్రజాశక్తి-ములకలచెరువు

మండలంలోని మద్దినాయినిపల్లి పంచాయతీ గద్రాజులపల్లిలో వెలసిన చౌడేశ్వరి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణం, ఆలయగోపుర నిర్మాణానికి ప్రముఖ పారిశ్రామికవేత్త దాసిరిపల్లి జయచంద్రారెడ్డి లక్ష రూపాయల విరాళాన్ని ఆలయఅర్చకులు, గ్రామ పెద్దలకు శనివారం అందించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ ఆలయ సందర్శనకు గ్రామానికి విచ్చేసిన సందర్భంగా మేళ తాళాలు, డప్పు వాయిద్యాలతో ఆయనకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో మద్దినాయిని పల్లి మాజీ సర్పంచ్ పి.మస్తాన్ రెడ్డి. మార్కిరి వారిపల్లి జి.రెడ్డప్పరెడ్డి, తరుగుశివారెడ్డి, దాదం లోకనాథరెడ్డి, ఆంజనేయరెడ్డి, మాజీ ఎంపిపి కె.నరసింహారెడ్డి. గంగుల్‌రెడ్డి పాల్గొన్నారు.

పైప్‌లైన్ లీకేజీతో వృథాగా పోతున్న నీరు

ప్రజాశక్తి-గాలివీడు

పట్టణంలోని పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న వీధిలో పైప్‌లైన్ లీకేజీ కావడంతో నీరు వృథాగా పోతోంది. రోడ్డుపై నీరంతా ప్రవహి స్తుం డటంతో వాహ నదారులు, పాదాచారులు బురద పోయే పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పైప్‌లైన్‌ను పునరుద్ధరించి నీరు వృథా కాకుండా చూడాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



రోడ్డుపై వృథాగా పోతున్న నీరు

క్రైం కార్నర్

బంగారు దుకాణంలో చోరీ

ప్రజాశక్తి-కలకడ

బంగారు దుకాణంలో చోరీ జరిగిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. మండల కేంద్రమైన కలకడ జెండా మాను వీధిలో ఉన్న సయ్యద్‌జాఫర్‌భాషాకు చెందిన ఎస్ జెబి జ్యువలరీ షాప్ ఉంది.ఈ క్రమంలో గురువారం ఎవరో గుర్తుతెలియని వ్యక్తి బంగారు కొనడానికి షాపుకు వచ్చినట్లు యజమాని పోలీసులకు తెలిపారు. బంగారు కుంటున్న సమయంలో తన షాపులో ఉన్న ఏడు గ్రాముల 100 మిల్లీ గ్రాములు గల డాలర్ చైను, నాలుగు గ్రాముల ఉంగరాన్ని గుర్తు తెలియని వ్యక్తి దొంగలించినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వీటి విలువ రూ.60 వేలు ఉంటుందని తెలిపారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం సాయంత్రం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో వ్యక్తిపై కేసు నమోదు

ప్రజాశక్తి-కలకడ

డ్రంక్అండ్‌డ్రైవ్‌లో వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. మండల కేంద్రమైన కలకడ పంచాయతీ కలకడ కొత్త పల్లికి చెందిన పల్లేటి కృష్ణయ్య కుమారుడు పల్లేటి మధు మద్యం సేవించి తన హోండా యాక్టివాను నడుపు తుండగా పట్టుబడినట్లు తెలిపారు. వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో మద్యం మత్తులో తన ద్విచక్ర వాహనాన్ని నడుపుతొండడం గమనించిన ఎస్ఐ తనిఖీలు చేయగా, మద్యం సేవించినట్లు గుర్తించి అతనిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.ఈ క్రమంలో పల్లేటి మధును కోర్టుకు హాజరుపరచడం జరిగిందని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, అలా నడిపితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

13 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి-రామాపురం

13 టన్నుల రేషన్ బియ్యం కర్ణాటక రాష్ట్రానికి అక్రమంగా తరలిస్తుండగా విజిలెన్స్ సిఐ సివిల్ సప్లై డిటి దాడి చేసి రామాపురం బస్టాప్ వద్ద పట్టుకున్నారు. చెన్నూరుకు చెందిన షేక్ ఖాజా లారీలో కర్ణా టకలోని బంగారుపేటకు అక్రమంగా తరలిస్తుండగా దాడి చేసి బియ్యాన్ని పట్టుకున్న ట్లు ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు. లారీని సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఎవరై రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.